# చక్రభ్రమణం

**- ఎమ్.హేమలత**

పనంతా పూర్తి చేసుకుని, ఆనాటి న్యూస్ పేపరు తీసుకొని, విశ్రాంతిగా కుర్చీలో కూచుంది అరుణ.

కాలింగ్ బెల్ చప్పుడికి చిరాగ్గా వెళ్ళి తలుపు తీసిన అరుణ, వాకిటి ముందు తన బాల్య స్నేహితురాలు గిరిజను చూసి ఆప్యాయంగా "గిరిజా! వాటె ప్లెజంట్ సర్‌ప్రైజ్. రా...రా..." అంటూ లోనికి ఆహ్వానించింది.

"రక్షించావు. నువ్వు ఇంట్లోనే వున్నావన్నమాట. ఆగాగు...నేనొక్కదాన్నే అనుకున్నావా? అదో...మా కుటుంబం యావత్తూ ఆ స్కూటర్ మీదుంది."

గిరిజ కొంటె మాటలకు నవ్వుతూ ఒక్క ఉదుటున గేటు కేసి నడిచింది అరుణ.

అరుణను చూడగానే స్కూటర్ మీంచి దిగి, విష్ చేశాడు గిరిజ భర్త నరేంద్ర.

"రండి లోపలికి" అంది అరుణ, నరేంద్రకేసి చూస్తూ.

"మరో మారు వస్తానులెండి. ఈ రోజు ఆఫీసులో ఇన్స్పెక్షన్ వుంది" స్కూటర్‌కే అందానిస్తూ కూర్చున్న కొడుకుని, కూతుర్ని కిందికి దింపాడు నరేంద్ర.



అరుణని సిగ్గు సిగ్గుగా చూస్తూ పిల్లలిద్దరూ గిరిజ వద్దకు పరుగుతీశారు.

"మరోమారు అంటారేంటండీ! సాయంత్రం మమ్మల్ని పికప్ చేయడానికి రారా? ఈ మహానగరంలో ఈ వానరద్వయంతో నేను ఇల్లు చేరుకోగలననే అనుకుం టున్నారా మీరు?"

గిరిజ వాగ్ధాటికి అలవాటు పడ్డ ప్రాణం కాబట్టి, నరేంద్ర నవ్వుకుంటూ "వస్తాను లేవోయ్" అంటూ స్కూటర్ని పరుగెత్తించాడు.

"ఆ...ఇక చెప్పండి అరుణాదేవిగారూ! తమరి ప్రొడక్షన్ సంఖ్య ఏమి చేయుచున్నవారలు? ఎటనున్నవారలు..."సోఫాలో బాసిం పట్టేసుకుని కూచున్న గిరిజ, అరుణకేసి చూస్తూ అంది.

గిరిజ, నాటకీయ సంభాషణా ధోరణికి ఫక్కున నవ్వింది.

"ఏయ్! ఏంటా భాష! కాలేజీలో వేసిన నాటకాలు చాల్లేదా? మళ్ళీ మొదలెట్టావా?" నవ్వుతూ గిరిజ పక్కనూ కూర్చుంది అరుణ.

పిల్లలిద్దరూ హాల్లోని వస్తువుల్ని, షోకేస్‌లోని

బొమ్మల్ని చూడ్డంలో నిమగ్నులయ్యారు.

"సరేలే! పుర్రెతో పుట్టిన బుద్ధి..."

"ఇక ఆపు తల్లీ! గిరిజా! పిల్లల తల్లివయినా నీలో ఏమీ మార్పు లేదే! మొత్తానికి నన్ను గుర్తు పెట్టుకొని వచ్చావు. థాంక్స్. మనిద్దరం కల్సుకొని అయిదేళ్ళయింది కదూ! నా ప్రొడక్షన్ గురించి కదూ అడిగావు. ఇంతవరకూ నిల్" అంది అరుణ నవ్వుతూ.

ఇంతెత్తున ఎగిరి పడింది గిరిజ.

"పెళ్ళయి పదేళ్ళయినా ఇంతవరకూ నీకు పిల్లలు లేరంటే..."

"ఏం! మేమిలా సుఖంగా వుండడం నీకు బాధగా వుందా?"

"అబ్బే! బాధ కాదు అరుణా, అసూయ! నన్ను చూడు- పెళ్ళయిన పదకొండో నెల అదిగో ఆ ముచ్చు ముఖం దిగింది. మళ్ళీ ఏడాదికి ఈ తోక దిగాడు."

పకపకా నవ్వింది అరుణ.

" ఈ అందాల బొమ్మను పట్టుకొని, ముచ్చు ముఖం అంటున్నావా?" అంటూ పాపను దగ్గరకు లాక్కొని "నీ పేరేంటి పాపా?" అంది బుగ్గలు పుణుకుతూ.

"చెప్పవే మొద్దూ! మాటలు రావా?" అంది గిరిజ, కూతురుకేసి చూస్తూ.

"సుతి" అంది ముద్దు ముద్దుగా పాప.

"ఏంటి గిరిజా! ఏదో సుత్తి అంటున్నది" అంది అరుణ అర్థంగాక.

"ఖర్మ! సుత్తి కాదే! శ్రుతి" అంది నవ్వేస్తూ గిరిజ.

"ఆంటీ! నా పేరేమో సరణ్" అన్నాడు నాలుగేళ్ళ బాబు.

**కైకూలు**
**స్త్రీపర్వం**


పురిటి నెప్పులెరగని
పురుష జాతి శైశవానికి
పట్టిందా పరమార్థపు ఉగ్గుపాలు
ఆడుకుంటూ బిడ్డ పడితే
దెబ్బ మాత్రం
అమ్మ గుండెకు
ఆత్మ ఆలకించిన పాట
ఆపాత మధురం
ఇప్పటికది జ్ఞాపకాల ప్రవాహం
తరం నుంచి తరందాకా
నిరంతరం
చిరంతనం
గోడవార మంచం మీంచే
వేకువనే
మేలుకొల్పు భూపాలిక
కడుపు మంట
తనివారా
కదులుతున్న కేదారం

- సాంధ్యశ్రీ

"చరణా! బాగుంది బాబూ నీ పేరు" అంటూ వాడిని ముద్దెట్టుకుంది అరుణ.

స్నేహితురాళ్ళిద్దరూ మాటల్లో పడిపోయారు. చెలిమల్లోని వూట నీటిలా మాటల్ని ఊరిస్తూ కాలం గడిపేస్తున్నారు స్నేహితురాళ్ళు. శ్రుతి, చరణ్ డ్రాయింగ్ రూములోనే వున్న అక్వేరియమ్‌లోని చేపల్ని చూస్తూ ఆనందిస్తున్నారు.

సాయంత్రం వరకూ టైం ఎలా గడిచిందో తెలియలేదు అరుణ, గిరిజలకి.




గేటు బయట స్కూటర్ హారన్ విని, "అదో...మావారొచ్చారు" అంటూ లేచింది గిరిజ.

"నీ తెల్లటి పామెరియన్ ఎంత ముద్దొస్తుందో! పేరేంటన్నావ్? ఫ్లఫీ కదూ! శ్రుతి, చరణ్‌లు కూడా బాగానే ఆడుకున్నారు దాంతో. పిల్లా-జల్లా లేని నీ పనే హాయిగా వుంది. ఇల్లు చక్కగా దిద్దుకున్నావ్. భార్యా భర్తలిద్దరూ స్వేచ్ఛా జీవులు. ఎక్కడికి కావాలంటే అక్కడికి చెక్కేస్తారు. నన్ను చూడు. అప్పుడే పిల్లలకోడినయ్యాను. ఇదిగో ఈ కాన్పుతో ఫుల్‌స్టాప్ పెట్టేస్తానులే..." బయటకు నడుస్తూ అంటున్న గిరిజ మాటలకు నవ్వేసింది అరుణ.

* * *

అరుణా వాళ్ళింటి గృహప్రవేశానికి వచ్చింది గిరిజ. ఈ తడవ శ్రుతి, చరణ్‌లతో పాటు కిరణ్ కూడా వున్నాడు. శ్రుతి అప్పుడే టెంత్ చదువుతోంది. మగపిల్లలిద్దరూ ఒకడు ఎయిత్, ఇంకొకడు ఫోర్త్.

"నీకేం తల్లీ! హాయిగా ఇల్లు కట్టుకున్నావు. మమ్మల్ని చూడు. ఈ సంతానానికి సమకూర్చడంతోనే సరిపోతున్నది. స్కూలు ఫీజులు, పుస్తకాలు...అబ్బబ్బ, తడిసి మోపెడవుతున్నది. రిటైరయ్యే లోపలయినా ఇల్లు కట్టుకుంటామో లేదో..."

"గిరిజా! నీకేమే! నువ్వు, మీవారు రిటైరై కాలుమీద కాలు వేసుకొని కూర్చుంటే మీ పిల్లలు మిమ్మల్ని మారాజుల్లాగా చూసుకుంటారు. పిల్లలే గిరిజా రేపటి మన బ్యాంక్ బ్యాలన్స్" అంది అరుణ, గిరిజ మాటలని అడ్డుకుంటూ.

"అలా అనుకునేనమ్మా ఇప్పుడీ తిప్పలన్నీ! అది సరే కానీ మీ వారికి నెలకు ఇరవై వేల వరకూ వస్తాయి కదా! ఏం చేసుకుంటారే అంత డబ్బు? పిల్లా పాపలు కూడా లేరైరి..."

గిరిజ మాటలకి ఒక్క నిమిషం అరుణ హృదయం కలుక్కుమంది.

నెల తిరగ్గానే మెడిసన్ చదివే బావగారి అమ్మాయి సరితకి పంపాల్సిన మూడు వేల రూపాయలు, యూనివర్శిటీలో ఎమ్.ఎస్సీ చేస్తున్న అన్నగారి అబ్బాయి కమల్‌కి పంపాల్సిన రెండు వేల రూపాయలు...సరే ఇక కొత్తగా కట్టుకున్న ఇంటికని తీసుకున్న హెచ్.డి.ఎఫ్.సి లోను కళ్ళ ముందుకు వచ్చి నిలిచాయి.

గిరిజ ప్రశ్నకి సమాధానాన్ని దాటేసి, ఇంటికి వచ్చిన అతిథుల్ని పలకరించడంలో పడిపోయింది అరుణ.




**"బీమా" దేనికి?**

"వారసులు" కూర్చొని తినడానికి!

* * *

**గతించిన దేశ నాయకులకు మనమిచ్చే "గౌరవం"?**

"పోస్టల్ స్టాంప్స్"గా నాయకుల ఫోటోలు అచ్చు వేయించి, వారి ముఖాల మీద "పోస్టల్ ముద్ర" వెయ్యడం!

* * *

**"సెంట్లూ, పౌడర్లూ" దేనికి?**

"ఒంటి కంపు" కప్పి పుచ్చుకోడానికి!

* * *

**ప్రభుత్వ శాఖల్లో "అధికారులు" ఎందుకు?**

కూడబెట్టుకోవడానికి!

* * *

**"పన్నులు" దేనికి?**

ప్రజలు "గోల" పెట్టడానికి!

* * *

**అమెరికా-రష్యాలకు మన దేశం ఎప్పుడు "అప్పు" ఇచ్చే స్థితిలో వుంటుంది?**

తారల ఆస్తులూ, నాయకుల ఆస్తులూ "జాతీయం" చెయ్యగానే!

* * *

**"సినిమా డైరెక్టర్లు" తలకి "కట్టు" కడతారెందుకు?**

వచ్చే ఐడియాలకి, తల "రెండుగా విడిపోకుండా వుండడానికి!

* * *

**"దానధర్మాలు" ఎందుకు?**

"స్వర్గం"లో "సీటు"కు "అడ్వాన్స్ బుకింగ్"!

* * *

**"నగర పాలక సంస్థలు" ఎందులో "ముందంజ" వేస్తున్నాయి?**

"ఇంటి పన్ను నోటీసులు" ఆర్నెల్లు ముందుగానే అందజెయ్యడంలో!

* * *

**"ఆంధ్రరాష్ట్రంలో" మూడు గంటలు పని చేస్తే, "ఆర్నెల్లు" పడుకునేవి ఏవి?**

"పవర్‌ప్లాంట్స్"!

* * *

శృతి పెళ్ళిలో తెగ హడావిడి పడిపోతున్నది గిరిజ. అప్పుడే వివాహ మండపంలోకి వస్తున్న అరుణను చూసి, ఆదరాబాదరాగా ఎదురెళ్ళింది.

"ఇప్పుడు తీరిందన్నమాట నీకు. ముందుగా రమ్మని అన్ని మార్లు ఫోన్ చేసి చెప్పినా ఇప్పుడా నువ్వు వచ్చేది! పిల్లా పాపాలేని మీకే తీరకుంటే ఎలా? పద...పద...శృతి నీకోసం వెయిట్ చేస్తోంది, ఆంటీ ఇంకా రాలేదా అంటూ. పువ్వుల జడ నువ్వేస్తే తప్ప కుదరదట" అరుణను దాదాపు నెట్టుకుంటూ లోపలికి తీసుకెళ్ళింది గిరిజ.

సరిత, ఆమె భర్త హేమంత్, వాళ్ళ అమ్మగారు, సరిత పిల్లలిద్దరూ వెరసి అరడజను గెస్టులు ఇంటినిండా. వాళ్ళందరికి అన్నీ సమకూర్చి తను బయటపడేసరికి ఇవాళయింది. బాదరా బందీ లేని భార్యాభర్తలు కదా వారికేం అనుకుంటారు. దిగే బంధువర్గానికి మాత్రం లోటేం లేదు. మనస్సులోనే నిట్టూర్చి, ముస్తాబవుతున్న పెళ్ళి కూతురు శృతి వద్దకు నడిచింది అరుణ.

* * *

"అమ్మయ్య! చిన్నవాడు కిరణ్‌కి కూడా జాబ్ వచ్చింది అరుణా! వాణ్ణో ఇంటివాడిని చేస్తే మా బాధ్యత తీరిపోతుంది" సినిమా హాల్లో కూర్చుని సినిమా చూస్తుందే కాని గిరిజకు ఎంతసేపూ తన పిల్లల గురించిన ఆలోచనలే. శృతి భర్తతో పాటు అమెరికా వెళ్ళిందట. చరణ్ భార్యా పిల్లలతో డెహ్రాడూన్‌లో వున్నాడట. కిరణ్‌కి మస్కట్‌లో ఉద్యోగం వచ్చిందట. ఓ నెలరోజుల్లో వాడూ వెళ్ళిపోతాడట.

నిజమే! పిల్లలు లేని తనూ తన భర్త ఇటువంటి జీవన మాధుర్యాలకి నోచుకోలేదు. కానీ ఎప్పటికప్పుడు వచ్చి పడుతున్న బరువు బాధ్యతల నుంచి మాత్రం తప్పించుకోలేకపోతున్నారు. పోనీలే! వున్నంతలో పెట్టాం వాళ్ళకి. అంతటితో తృప్తి పడడమే మంచిది. మనస్సును చిక్కబట్టుకుంది అరుణ.

* * *

"ఏమయింది గిరిజా నరేంద్రగార్కి?" అంటూ వచ్చింది అరుణ.

"ఇప్పటికి గుర్తుకొచ్చామా తల్లీ మేము నీకు? ఔన్లే స్వంత పిల్లలూ...బంధువులే పట్టించుకోలేదు" నిష్ఠూరంగా మాట్లాడుతున్న గిరిజకేసి బాధగా చూసింది అరుణ.

"గిరిజా! మేము ఇండియాలో లేము కదా! శృతి ఫోన్ చేసి మీవారి సంగతి చెప్పగానే రెక్కలు కట్టుకొని రావాలనిపించింది. అప్పుడు కమల్ దగ్గర కాలిఫోర్నియాలో వున్నాము. ఫ్లైయిట్ కన్‌ఫర్మ్ అయ్యి, నేనిక్కడికి వచ్చేందుకు పది రోజులు పట్టింది. అప్పటికీ నేనొక్కదాన్నే రాగలిగాను. ఆయన ఇంకా అక్కడే వున్నారు. బాంబేలో సరిత రిసీవ్ చేసుకొని 'వారం రోజులయినా వుండకుండా వెళ్తారా ఆంటీ' అంటూ నిష్ఠూరమాడింది. ఆ అమ్మాయికెలాగో నచ్చజెప్పి తప్పించుకుని వచ్చేశాను."

"నీకేమమ్మా! అదృష్టవంతురాలివి. పిల్లలు లేరన్నమాటే గానీ, మిమ్మల్ని ప్రేమగా, పువ్వుల్లా చూసుకునే ఆత్మీయులున్నారు. కానీ నాకూ వున్నారు పిల్లలు. ఎందుకు?"



## నో ఎక్స్‌పోజింగ్...!

ఐశ్వర్యారాయ్‌కి ఈ మధ్య హాలీవుడ్ సినిమాల్లో అవకాశాలు భారీగానే వచ్చిపడు తున్నాయి. సహజంగా హాలీవుడ్ సినిమాల్లో ఎక్స్‌పోజింగ్ చెయ్యడం అక్కడి తారలకు కొత్త విషయం ఏమీ కాదనేది అందరికీ తెలిసిందే. అయితే ఐస్ మాత్రం అందుకు విరుద్ధంగా హాలీవుడ్ సినిమాల్లో ఎక్స్‌పోజింగ్ చెయ్యనని అంటోంది. అయినా సినిమా తారలకు ముందు ఇలాంటి స్టేట్‌మెంట్స్ ఇవ్వడం తరువాత పాత్రకు అనుగుణంగా అలా నటించవలసి వచ్చింది అనడం మామూలే కదా!

"సరి...సరి...నరేంద్రగారెక్కడ? ఎలా వున్నారు?" లోపలికి దారి తీస్తూ అంది అరుణ.

"మూడు నెలల క్రితం విరుచుకు పడిపోయారే! శుభ్రంగా తిని, తిరుగుతున్న మనిషికి అదేం రోగమో, మా కోసమే కనిపెట్టుకు కూర్చున్నట్లుంది. మొదటి పదిరోజులయితే ప్రాణం మీదే ఆశ లేదన్నారు. ముగ్గుర్ని కన్నాము. ఒక్కరంటే ఒక్కరు ఆయనకు శుశ్రూష చేయడానికి, నాకు ధైర్యం చెప్పడానికి దగ్గర లేకపోయారు" గిరిజ కళ్ళు చెమ్మగిల్లిపోయాయి.

"గిరిజా! బొత్తిగా పిల్లల్ని అలా తీసిపారేయకు. ఎక్కడో దేశం కాని దేశంలో వున్నవాళ్ళు వెంటనే బయల్దేరి రావడానికి వాళ్ళకు పాపం ఎన్ని ఇబ్బందులో..."

"ఆ...సంబడం. అంత ప్రేమేమీ కారిపోవడం లేదులే! ఇలా వచ్చారు, అలా వెళ్ళారు. వీళ్ళేదో మమ్మల్ని వుద్ధరిస్తారని, వీళ్ళ కోసమే అన్నట్లు బ్రతికాం..."

"ఇదండీ! గిరిజ ధోరణి! ఎంత చెప్పినా వినిపించుకోదు. ఎంతసేపూ పిల్లలు దగ్గరలేరు. మనల్ని పట్టించుకోలేదంటూ ఒకటే బాధ పడిపోతోంది. రోజు రోజుకూ మరీ పిచ్చివాలకమైపోతున్నది!" ఆ నాలుగు మాటలకే నరేంద్రకు ఆయాసం ముంచుకొచ్చింది.

"ఏంటి గిరిజా! నువ్వు మరీను! నరేంద్రగార్కి ధైర్యం చెప్పాల్సిందిపోయి నువ్వే ఇలా అయితే ఎలా...?"

"లేదు అరుణా! పిల్లలో...పిల్లలో..అని మురిశాము. వాళ్ళని చూసి గర్వపడ్డాము. పిల్లలులేని నిన్ను చూసి జాలిపడ్డాము. నువ్వా మీవారే సుఖపడుతున్నారు. కడుపు నిండా పిల్లల్ని కన్న నేనే ఈనాడు జాలిపడాల్సిన పరిస్థితుల్లో వున్నాను."

"ఏమిటి గిరిజా! నరేంద్రగారన్నట్లు నువ్వు నిజంగా పిచ్చిదానిలా మాట్లాడుతున్నావు. ఓ నిజం చెప్పనా గిరిజా! నీ పిల్లల్ని కనీ పెంచడంతో పాటు నా పిల్లలు, కష్టకాలంలో నాకు అండదండగా వుంటారు అనే కోర్కెను,స్వార్థపూరిత హక్కును బలీయంగా నీలో పెంచుకున్నావు. అది సహజం కూడా! వారి వద్ద నుంచి నువ్వు ఆశించిన ఊతం నీకేనాడూ లభించకపోవడంతో, నిరాశ, నిస్పృహలతో కృంగిపోతున్నావు.

నేనేదో హాయిగా వున్నానన్నావే. ఆ విషయానికొస్తే నాకెలాగూ పిల్లలు లేరు. నా శక్తి మేరకు నా బంధువుల్ల పిల్లలకు సాయం చేశాను. కృతజ్ఞతా భావంతో కావచ్చు, ప్రేమతో కావచ్చు, జాలితో కావచ్చు. వాళ్ళలో ఏ ఒక్కరు మా పట్ల అక్కర, అభిమానం చూపించినా పొంగిపోయాము.

పిల్లలందరూ ఒక్కటే గిరిజా! కన్నవాళ్ళయితే ఏవేవో చేస్తారని ఎక్కువ ఊహించుకుంటాము. అదే పరాయివారయితే వారి వద్ద నుంచి ఏ చిన్న రెస్పాన్స్ వచ్చినా అదే పదివేలు అనుకొని ఆనందపడిపోతాము. పిల్లలది లోపం అని నేను అనను. లోపం పెద్దవాళ్ళలోనే వుంది. ఉన్నదంతా కన్న పిల్లలకే ధారపోస్తూ, మన చుట్టూ వున్న మిగతా వారిని పట్టించుకోకపోవడం కూడా ఓ తరహా స్వార్థంగానే భావించాలి మనం.

పోనీలే గిరిజా! నీ పిల్లల పట్ల నీ బాధ్యత నెరవేర్చావు. అలాగే రేపు వాళ్ళు, వాళ్ళ పిల్లల్ని పెంచి పెద్ద చేస్తారు. ఇది ఓ చక్రభ్రమణం. ముందుకే కానీ వెనక్కి తిరిగి చూడని చక్రభ్రమణం."

తన మాటల్ని జీర్ణించుకోవడానికి ప్రయత్నిస్తున్న స్నేహితురాలు గిరిజ భుజాల చుట్టూ ఆప్యాయంగా చేతులేస్తూ సాంత్వన పరిచింది అరుణ. ❀

## ఇంత సీన్ ఉందా?

సొట్టబుగ్గల ప్రీతీజింతాకు కేవలం హీరో లను బుట్టలో వేసుకోవడమే తెలుసనుకుంటే పొర పాటే. నటిగా ప్రీతీజింతాలో మంచి టాలెంట్ ఉంది. దర్శకులు, సినిమా యూనిట్ సభ్యులు ప్రీతిలో క్యారెక్టర్ లీనమయి నటించగల సత్తా ఉందని పొగుడుతున్నారు. దీనికి కారణం ప్రీతీజింతా హృతిక్‌రోషన్‌తో కలిసి 'లక్ష్య' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా కోసం హృతిక్ ఆర్మీ ట్రైనింగ్ తీసుకుంటూ ఉంటే, ప్రీతీ ఆర్మీ జవాన్ భార్యగా నటించడానికి ఆర్మీ ఆఫీసర్ల భార్యల వద్ద ట్రైనింగ్ తీసుకుంటోంది. సొట్టబుగ్గల ప్రీతిలో ఇంత సీన్ ఉందంటే ఆశ్చర్యంగా ఉంది కదా!

